గృహలక్ష్మిపై సందేహాలెన్నో..?

- గడువు పెంచాలని డిమాండ్ చేస్తున్న ప్రజలు
- గ్రామకంఠం, దస్తావేజులు, నోటరీలపై అనుమానాలు
- జిల్లాలో దరఖాస్తు చేసుకున్న వారి సంఖ్య 2,567 మాత్రమే..
- గ్రేటర్ హైదరాబాద్‌తో సహా రంగారెడ్డి జిల్లాలోనూ ఇదే పరిస్థితి

నేటితో దరఖాస్తుల గడువు ఆఖరు


ఘట్‌కేసర్‌లో మీ సేవ కేంద్రం వద్ద ప్రజలు

సాక్షి, మేడ్చల్ జిల్లా: పేద, మధ్యతరగతి వర్గాల సొంతింటి కలను నెరవేర్చేలా ప్రభుత్వం ‘గృహలక్ష్మి’ పథకం అమలుకు శ్రీకారం చుట్టింది. ఇళ్లు లేక ఇబ్బందులు పడుతున్న వారికి నివాసం కల్పించేందుకు జీవో ఎంఎస్ 25 కింద మార్గదర్శకాలను విడుదల చేసింది. ఇప్పటికే రెండు పడక గదుల ఇళ్లను నిర్మించి పంపిణీ చేయగా, ఇక సొంత జాగా కలిగి ఉండి ఇళ్లు నిర్మించుకునే వారికి గృహలక్ష్మి పథకం కింద రూ.3 లక్షలు అందజేసేందుకు చర్యలు తీసుకుంటోంది. అందులో భాగంగానే మంగళవారం నుంచి దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియను ప్రారంభించి.. ఈ నెల 10వ తేదీ వరకు తుదిగడువు విధించడంతో అందరిలో అయోమయం నెలకొంది. దరఖాస్తుకు ఏ పత్రాలు జతచేయాలో.. ఎవరి పేరిట దరఖాస్తు చేసుకోవాలో తెలియక ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గ్రామకంఠం స్థలాలు ఉన్న వారికి దస్తావేజులు లేకపోవడం, అసైన్డ్ భూములు, నోటరీలు ఉన్న పేదలు కూడా దరఖాస్తు చేసుకునేందుకు ఎన్నో అనుమానాలను వ్యక్తం చేస్తున్నారు. ఇదే పరిస్థితి గ్రేటర్ హైదరాబాద్‌తోసహా రంగారెడ్డి జిల్లాలో నెలకొంది. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో మాత్రం ఇప్పటి వరకు 2,567 మంది దరఖాస్తులు మాత్రమే వచ్చాయి. హైదరాబాద్, రంగారెడ్డి జిల్లాలో కూడా దరఖాస్తులు సమర్పించిన తీరు ఇంచుమించు అలాగే ఉంది. సొంత స్థలం ఉండి.. పక్కా ఇల్లు లేని బలహీనవర్గాల కుటుంబాలు మాత్రమే గృహలక్ష్మి పథకం కింద దరఖాస్తు చేసుకునేందుకు ప్రభుత్వం వెసులుబాటు కల్పిస్తోంది.

నేటితో ఆఖరు కావటంతో..

దరఖాస్తుల సమర్పణకు కేవలం గురువారం మాత్రమే గడువు ఉండటంతో అందరిలో అనుమానాలను రేకెత్తిస్తోంది. కుల, వార్షికాదాయ వివరాలను అడగడం.. ఇళ్ల కేటాయింపుల్లో కులాల వారీగా రిజర్వేషన్లు ఉండటంతో.. ఆ పత్రాలు లేని వారిలో ఆందోళన వ్యక్తమవుతోంది. గడువులోగా ఆ పత్రాలు వస్తాయో, రావో అన్న మీమాంస కూడా వారిని వెంటాడుతుండటంతో .. గడువు పెంచాలన్న డిమాండ్ ప్రజల నుంచి వ్యక్తమవుతోంది.

సాయం ఎలా పొందాలంటే..

ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.3 లక్షలను ఒకేసారి ఇవ్వదు. వీటిని మూడు విడతలుగా మంజూరు చేస్తారు. ఇల్లు నిర్మించుకునే లబ్ధిదారులు మొదట పునాది నిర్మించిన సమయంలో రూ.లక్ష, రూఫ్ లెవల్లో మరో రూ.లక్ష, ఇంటి నిర్మాణం పూర్తయ్యాక మరో రూ.లక్ష విడుదల చేయనుంది. లబ్ధిదారుడు తనకు నచ్చిన విధంగా ఇల్లు నిర్మించుకోవచ్చు. రెండు గదులతోపాటు మరుగుదొడ్డి తప్పక నిర్మించుకోవాలి. ఇల్లు ఉండి జీవో 59 కింద లబ్ధిపొందిన వారికి గృహలక్ష్మి పథకం వర్తించదు. స్థానికంగా ఆహార భద్రత కార్డు, రేషన్ కార్డు కలిగి ఉండి మహిళ పేరుతో దరఖాస్తు చేసిన వారికి మాత్రమే ప్రభుత్వం ఇల్లు మంజూరు చేస్తోంది. మంజూరైన డబ్బులను కూడా 100 శాతం రాయితీలో ఇవ్వనుంది.

దరఖాస్తుతో జత చేయాల్సినవి ఇవే..

నిర్ణీత దరఖాస్తుతో రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలు, ఆహార భద్రత కార్డు, ఓటరు కార్డు, ఆధార్‌కార్డు, ఇంటి స్థలం దస్తావేజులు, ఇంటి పన్ను రసీదు, విద్యుత్తు బిల్లు రసీదు, బ్యాంకు పాసుబుక్ జిరాక్సు ప్రతులను జత చేయాల్సి ఉంటుంది. దివ్యాంగులైతే సదరం సర్టిఫికెట్‌ను సమర్పించాల్సి ఉంటుంది.

కౌంటర్లు ఇక్కడే..

జిల్లా కలెక్టర్ అమయ్‌కుమార్ ఆదేశాలతో మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలో కలెక్టరేట్‌తోసహా 15 తహసీల్దార్ కార్యాలయాలు, 13 పురపాలక సంఘాల కార్యాలయాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని మున్సిపల్ సర్కిల్ కార్యాలయాల్లో ప్రజల నుంచి గృహలక్ష్మి దరఖాస్తులు తీసుకునేలా ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేశారు.

ప్రత్యేక పోర్టల్..

గృహలక్ష్మి పథకంలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా పకడ్బందీగా అమలు పరిచేందుకు ‘గృహలక్ష్మి’ పేరుతో ప్రత్యేక పోర్టల్‌ను ప్రభుత్వం రూపొందించింది. దరఖాస్తుల ఎంపిక ప్రక్రియను మున్సిపల్ కమిషనర్లు, కలెక్టర్లకు ప్రభుత్వం అప్పగించింది. దశలవారీగా ఎంపికైన లబ్ధిదారులకు జిల్లా మంత్రి ఇళ్లను మంజూరు చేయనున్నారు.

పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు


నాగారం మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల ప్రారంభోత్సవంలో మంత్రి మల్లారెడ్డి తదితరులు

మంత్రి చామకూర మల్లారెడ్డి

కీసర: మున్సిపాలిటీల్లో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. బుధవారం నాగారం మున్సిపాలిటీలో రూ.4.34 కోట్లతో వివిధ వార్డుల్లో చేపట్టిన అభివృద్ధి పనులను మంత్రి చామకూర మల్లారెడ్డి మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు శివారు మున్సిపాలిటీల్లోని సమస్యలను పరిష్కరించేందుకు నిధులు కేటాయించి ప్రణాళికబద్ధంగా పనులు చేపడుతోందన్నారు. మున్సిపాలిటీల్లో అంతర్గత మురికి కాల్వల నిర్మాణాలు, సీసీరోడ్లు, పార్కుల అభివృద్ధి, హరితహారం, స్ట్రామ్‌వాటర్ పైప్‌లైన్ పనులు, కమ్యూనిటీ భవనాల అభివృద్ధి తదితర వాటికి ప్రాధాన్యం ఇస్తున్నట్లు చెప్పారు. మేడ్చల్ నియోజకవర్గంలోని మున్సిపాలిటీలను రాష్ట్రంలోని ఇతర మున్సిపాలిటీలకు ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు కృషిచేయడం జరుగుతుందన్నారు. నాగారంలో రూ.3.47కోట్ల ఎల్ఆర్ఎస్ నిధులతో సీసీరోడ్లు, వెంకటాద్రినగర్ కాలనీలో పార్కు కాంపౌండ్ వాల్, రాజ్‌సుఖ్‌నగర్, రాంపల్లి క్రాస్ రోడ్డులో రూ.30 లక్షలతో సీసీరోడ్లు, రాంపల్లిలో రూ.43 లక్షల నిధులతో నిర్మించిన జంతుజనన నియంత్రణ కేంద్రాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ముమ్ముందు మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు మంత్రి తెలిపారు. వైస్ చైర్మన్ బండారి మల్లేష్‌యాదవ్, నాగారం మున్సిపల్ కమిషనర్ రాజేంద్రకుమార్, మేనేజర్ చంద్రోఖర్, కౌన్సిలర్లు, గూడురు సబితాఆంజనేయులుగౌడ్, కొకుట్ల మమత, కొకుట్ల కృష్ణారెడ్డి, కొకుట్ల అనంతరెడ్డి, బిజ్జ శ్రీనివాస్‌గౌడ్, దివ్యదయాకర్‌రావు, సుర్వీ శ్రీనివాస్, కొమురెల్లి అనితాసుధాకర్‌రెడ్డి, మోకు రేణుకజగన్‌మోహన్‌రెడ్డి, గోక కళావతి, మాదిరెడ్డి వెంకట్‌రెడ్డి, పంగ హరిబాబు, నాగేష్‌గౌడ్, సరితారమేష్, ప్రియాంక, అన్నంరాజు లావణ్యశ్రీనివాస్, లక్ష్మీవేణుగోపాల్, సుమిత్రసురేష్, కో ఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

మేడ్చల్ ప్రామాణికంగా వ్యవసాయ గణన

ముఖ్య ప్రణాళిక శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు సౌమ్య

సాక్షి, మేడ్చల్ జిల్లా: వ్యవసాయ గణన ప్రతి ఐదేళ్లకోసారి ఒకసారి మూడు దశల్లో జరుగుతుందని, ప్రస్తుతం ఈ గణన మేడ్చల్ జిల్లాలో 2021–22ను ప్రామాణిక సంవత్సరంగా తీసుకొని నిర్వహిస్తున్నట్లు ముఖ్యప్రణాళిక శాఖ రాష్ట్ర సంయుక్త సంచాలకులు సౌమ్య తెలిపారు. బుధవారం జిల్లా ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో వ్యవసాయ గణన 2021–22 సంబంధించిన అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, డివిజనల్, మండల గణాంక, అర్థ గణాంక శాఖ అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ వ్యవసాయ గణన సమాచారాన్ని రాష్ట్రస్థాయిలో అభివృద్ధి ప్రణాళికలు, సాంఘిక, ఆర్థిక విధాన రూపకల్పనకు అనేకమంది అనేక స్థాయిల్లో ఉపయోగిస్తారన్నారు. కమతాలు స్వరూప స్వభావాల వారీగా, పరిమాణ తరగతుల వారీగా కమతాల సంఖ్య, వాటి విస్తీర్ణం, భూవినియోగం, వనరుల వారీగా నీటిపారుదల విస్తీర్ణం, కౌలు వివరాలు వంటి సమాచారాన్ని డిజిటల్ పరికరాల ద్వారా సేకరించి, నమోదు చేయాలని ఆమె పేర్కొన్నారు. ప్రాముఖ్యత కలిగిన ఈ సమాచారాన్ని సమగ్రంగా సేకరించాలని ఆదేశించారు.

అవుషాపూర్‌ను సందర్శించిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు

ఘట్‌కేసర్: రాజేంద్రనగర్‌లో నాలుగు రోజుల శిక్షణలో భాగంగా వరంగల్, మెదక్, ఖమ్మం, జనగాం జిల్లాకు చెందిన జూనియర్ పంచాయతీ కార్యదర్శులు బుధవారం ఉమెన్ ఫ్రెండ్లీ పంచాయతీగా ఎన్నికైన అవుషాపూర్ పంచాయతీని సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ, డ్వాక్రా, ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ అరుణ, సర్పంచ్ కావేరిమశ్చేందర్‌రెడ్డి, శిక్షణ అధికారులు పాల్గొన్నారు.

పచ్చదనం పెంచడానికి నడుం బిగించాలి

ఘట్‌కేసర్: తెలంగాణ రాష్ట్ర సీడీఎంఏ కమిషనర్ పమేలా సత్పతి ఘట్‌కేసర్ మున్సిపాలిటీని బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా కొండాపూర్‌లోని నర్సరీని చైర్ పర్సన్ పావనీజంగయ్య, వైస్ చైర్మన్ మాధవరెడ్డితో కలిసి పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. మున్సిపాలిటీకి అవసరమైన మొక్కలు పెంచాలని, పచ్చదనం పెంచడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించాలన్నారు. కార్యక్రమంలో కమిషనర్ సాబేర్ అలీ, కౌన్సిలర్ శశికళ, మాజీ ఎంపీటీసీ గోపాల్‌రెడ్డి, మేనేజర్ అంజిరెడ్డి, జంగయ్యయాదవ్, సిరాజ్ పాల్గొన్నారు.


కొండాపూర్ నర్సరీ వివరాలు తెలుసుకుంటున్న కమిషనర్ పమేలా సత్పతి

బీటీ రోడ్డు పనులు ప్రారంభం

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి కండ్లకోయ నుంచి మండలంలోని గౌడవెల్లి గ్రామం వరకు చేపడుతున్న బీటీ రోడ్డు పనులను మున్సిపల్ కమిషనర్ రాములు, నాయకులు ప్రారంభించారు. రూ.2.75 కోట్లతో చేపడుతున్న పనులకు ఇటీవల మంత్రి మల్లారెడ్డి శంకుస్థాపన చేయగా బుధవారం మున్సిపల్ కమిషనర్ రాములు, వైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు దయానంద్‌యాదవ్, మాజీ సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, రాజమల్లారెడ్డి పూజలు చేసి పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేశ్, కృష్ణగౌడ్, శ్రీనివాస్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి అధికారులు పాల్గొన్నారు.

సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళ్లండి


మంత్రికి వినతి పత్రం అందజేస్తున్న బిల్‌కలెక్టర్లు, ఆపరేటర్లు

మేడ్చల్‌రూరల్: మున్సిపల్ కార్పొరేషన్, మున్సిపాలిటీ కార్యాలయాల్లో పనిచేస్తున్న బిల్ కలెక్టర్లు, సిస్టమ్ ఆపరేటర్లు బుధవారం మంత్రి మల్లారెడ్డిని కలిశారు. మంత్రి కార్యాలయంలో ఆయనను కలిసి తమకు వేతనాలు పెంచాలని, క్రమబద్ధీకరణ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. ఏళ్ల నుంచి ఉద్యోగాలు చేస్తూ నిరంతరం అన్ని పనులు చేసే తమకు చాలీచాలని వేతనాలు ఇవ్వడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వివరించారు. తమ వేతనాలు పెంచడంతో పాటు తమను క్రమబద్ధీకరించేలా మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, సీఎం కేసీఆర్‌ల దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో బిల్ కలెక్టర్లు ప్రసాద్, రాము, మహేశ్, సంతోష్, సుజాత, మంజుల, రేణుక, ఉమ్మడి జిల్లా బిల్ కలెక్టర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.


గృహలక్ష్మి పథకానికి దరఖాస్తు చేసుకోండి

సాక్షి, మేడ్చల్‌జిల్లా: గృహలక్ష్మి పథకం కింద సొంత స్థలం ఉన్నవారికి మహిళల పేరు మీద ఇళ్లు నిర్మించుకునేందుకు ప్రభుత్వం రూ.3 లక్షల ఆర్థిక సాయం అందచేస్తోందని ఆర్‌అండ్‌బీ శాఖ ఈఈ శ్రీనివాసమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 నుంచి 10వ తేదీ వరకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లబ్ధిదారులు స్థానికంగా నివాసం ఉండాలన్నారు. ఒక్కో నియోజకవర్గం నుంచి 3 వేల మంది చొప్పున గృహలక్ష్మి కింద ఇళ్లు నిర్మించుకునేందుకు అవకాశం ఉందన్నారు. దరఖాస్తులను కలెక్టరేట్, మున్సిపాలిటీ/ మున్సిపల్ కార్పొరేషన్/మండల కార్యాలయాల్లో స్వీకరిస్తున్నట్లు తెలిపారు.

క్రీడాకారుల ఎంపికకు నమోదు చేసుకోండి

సాక్షి, మేడ్చల్ జిల్లా: రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ ఆధ్వర్యంలో 2023–24 రాష్ట్ర సివిల్ సర్వీసెస్ క్రీడాకారుల ఎంపిక కోసం ఆలిండియా సివిల్ సెర్వీసెస్ టోర్నమెంట్ ఈ నెల 18, 21వ తేదీల్లో రాష్ట్రస్థాయి ఎంపికలు నగరంలోని జిమ్‌ఖానా గ్రౌండ్స్, ఎల్‌బీ స్టేడియంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి బీ.బలరామారావు ఒక ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, బాడ్మింటన్, బాస్కెట్ బాల్, క్రికెట్, చెస్, క్యారమ్స్, ఫుట్‌బాల్, హాకీ. కబడ్డీ, లాన్, పవర్ లిఫ్టింగ్, స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, రెజ్లింగ్‌లలో ఎంపిక ఉంటుందన్నారు. మేడ్చల్–మల్కాజిరి జిల్లాలో ఆసక్తి కలిగిన ప్రభుత్వ ఉద్యోగులందరూ ఈ నెల 11 వరకు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో తమ పేర్లు నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

కీసరలో ఘనంగా కాంగ్రెస్ ఆవిర్భావ దినోత్సవం



కీసర: కాంగ్రెస్ పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రమైన కీసరలో కాంగ్రెస్ నేతలు పార్టీ జెండావిష్కరణ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. పార్టీ కీసర మండల అధ్యక్షుడు కోల కృష్ణాయాదవ్, యూత్ కాంగ్రెస్ మేడ్చల్ జిల్లా ప్రధాన కార్యదర్శి తటాకం అభిలాష్, యూత్‌కాంగ్రెస్ కీసర మండల అధ్యక్షుడు కందాడి శివరాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ ముద్దం మల్లేష్, కీసర గ్రామశాఖ అధ్యక్షుడు జూపల్లి రవీందర్, నేతలు రామిడి స్వప్న విజయ్‌రెడ్డి, నల్ల మధుసూదన్‌రెడ్డి, మంచాల ప్రవీణ్, కందాడి సత్తిరెడ్డి, దయానంద్, తటాకం ఉమాపతి, చర్లపల్లి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశం కోసం పోరాడిన వీరులకు వందనం

మాజీ సైనికులను సన్మానించిన బీజేపీ నేతలు

కీసర: 75 ఏళ్ల స్వాతంత్య్ర అమృతోత్సవాల ముగింపు సందర్భంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో బుధవారం మేరామిట్టీ–మేరా దేశ్(నా మట్టి.. నా దేశం) అభియాన్‌లో భాగంగా నిర్వహించిన మాజీ సైనికులను సన్మానించారు. బీజేపీ మేడ్చల్ జిల్లా రూరల్ అధ్యక్షుడు పటోళ్ల విక్రంరెడ్డి మాట్లాడుతూ దేశం కోసం పోరాడిన వీరులు, అమరులకు వందనం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా దమ్మాయిగూడ మున్సిపాలిటీలో మాజీ సైనికులందరినీ ఘనంగా సన్మానించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బుద్ది శ్రీనివాస్, పార్టీ మేడ్చల్ జిల్లా రూరల్ ప్రధాన కార్యదర్శి జిల్లాల తిరుమల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్‌మెంబర్ అచ్చిమి నర్సింహ, పార్టీ మేడ్చల్ రూరల్ అధికార ప్రతినిధి గాలి సంపత్‌యాదవ్, నాగారం మున్సిపాలిటీ బీజేపీ అధ్యక్షుడు బుద్ధవరం వేణుగోపాల్, పార్టీ దమ్మాయిగూడ మున్సిపల్ అధ్యక్షుడు నాగమల్లారెడ్డి, వంగేటి బల్వంత్‌రెడ్డి, ఆంజనేయులు, బలరాంసింగ్, శ్రవణ్‌కుమార్, హరికుమార్ తదితరులు పాల్గొన్నారు.


మాజీ సైనికులను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్ సంతోష్‌నగర్‌లో కాలనీవాసులు సొంత నిధులు, డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ సహకారంతో బుధవారం భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మంత్రి మల్లారెడ్డి సహకారంతో సమస్యలు లేని డివిజన్‌గా నిలుపుతానన్నారు. బీఆర్ఎస్ నాయకులు రెడ్డిశెట్టి మహేష్, శ్రీమన్నారాయణ, మల్లారెడ్డి, చంద్రయ్య, బాలు, సైదులు, భారతి, సుజాత పాల్గొన్నారు.



ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటాలి

మేడ్చల్: హరితహారంలో భాగంగా ప్రతి ఇంటి వద్ద మొక్కలు నాటేందుకు మేడ్చల్ పట్టణంలోని కౌన్సిలర్లు బస్తీల్లో మహిళలకు మొక్కలను అందజేశారు. 23వ వార్డులో కౌన్సిలర్ కాడే మహేష్, 8వ వార్డులో కౌన్సిలర్ చాప రాజు మహిళలకు మొక్కలను అందజేసి అందరూ నాటాలని కోరారు. మేడ్చల్ పట్టణంలో సంపూర్ణ హరితం సాధించేందుకు అందరూ కృషి చేయాలని కోరారు.


మొక్కలను అందజేస్తున్న కౌన్సిలర్ మహేష్

వ్యభిచార గృహంపై దాడి

మేడ్చల్‌రూరల్: వ్యభిచార గృహంపై ఎస్ఓటీ పోలీసులు దాడి చేసి నిర్వాహకురాలితో పాటు ఓ యువతి, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకున్న ఘటన గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. మేడ్చల్ మండలం కేఎల్ఆర్ వెంచర్‌లో వ్యభిచారం నిర్వహిస్తున్నారనే సమాచారంతో మేడ్చల్ ఎస్ఓటీ పోలీసులు దాడులు నిర్వహించారు. నిర్వాహకురాలు, బెంగాల్‌కు చెందిన యువతి, ఇద్దరు విటులను అదుపులోకి తీసుకొని మేడ్చల్ పోలీసులకు అప్పగించారు.

ఎక్కడికక్కడ కాంగ్రెస్ నేతల అరెస్టు

కీసర: నాగారం మున్సిపల్ పరిధిలోని రాంపల్లి–చర్లపల్లి రహదారిని బాగు చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం మంత్రి మల్లారెడ్డి పర్యటన సందర్భంగా మంత్రికి వినతిపత్రం అందజేసేందుకు యత్నించిన కాంగ్రెస్ కౌన్సిలర్ పంబాల సరితారమేష్‌తో పాటు కాంగ్రెస్ నేతలు నల్లోల కుమార్ పలువురు కాంగ్రెస్ నేతలను పోలీసులు అరెస్టు చేశారు. ఈ సందర్భంగా పంబాల సరితారమేష్‌తో పాటు నల్లోల కుమార్ తదితరులు మాట్లాడుతూ రాంపల్లి–చర్లపల్లి రహదారి పూర్తిగా అధ్వానంగా తయారైందని, రోడ్డును బాగు చేయాలని నాలుగేళ్లుగా పట్టించుకోవడం లేదన్నారు. సమస్యను మంత్రి దృష్టికి తీసుకెళ్లేందుకు యత్నించడం కూడా నేరమన్నట్లు పోలీసులతో తమను అరెస్టు చేయించడం ఎంతవరకు సమంజసం అన్నారు. రోడ్డును బాగు చేసేంత వరకు పోరాటం ఆగదన్నారు. కాంగ్రెస్ నేతలు శ్రీశైలం, విగ్నేష్, సోమిరెడ్డి, శ్రీధర్‌గౌడ్, ఎండీ షమి, పి.పరమేష్, ఓంప్రకాష్, సంతోష్‌గౌడ్, కందాడి శివరాంరెడ్డి, సింగిరెడ్డి హరిప్రసాద్‌రెడ్డి తదితరులు ఉన్నారు.


కాంగ్రెస్ నేతలను అరెస్టు చేస్తున్న కీసర పోలీసులు

క్లుప్తంగా...

నేడు కరెంటు ఉండని ప్రాంతాలు

శామీర్‌పేట్: అలియాబాద్ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు బుధవారం అంతరాయం ఏర్పడుతుందని ఏఈ శ్రీనివాస్ తెలిపారు. జగ్గంగూడ 11కేవీలో మరమ్మతుల కారణంగా ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జగ్గంగూడ, గుబ్బ, లాల్‌గడి మలక్‌పేట పరిధిలోని పారిశ్రామికవాడల్లో విద్యుత్ సరఫరాను నిలిపివేయనున్నట్లు తెలిపారు.

మెడిసిటీ సబ్ స్టేషన్ పరిధిలో..

మేడ్చల్: మండలంలోని మెడిసిటీ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మల నరికివేత కారణంగా బుధవారం పలు ప్రాంతాల్లో కరెంట్ సరఫరా ఉండదని ఏఈ శశిధర్‌రెడ్డి తెలిపారు. సబ్ స్టేషన్ పరిధిలోని పరిశ్రమలకు ఉదయం 10 నుంచి సాయంత్రం 5గంటల వరకు కరెంట్ సరఫరా ఉండదని ఏఈ తెలిపారు.

నేడు మంత్రి మల్లారెడ్డి పర్యటన

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండలంలో రాష్ట్ర కార్మికశాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి గురువారం పర్యటించనున్నారని ఎంపీపీ హారిక ఓ పత్రిక ప్రకటనలో తెలిపారు. మండల పరిధిలోని జగ్గంగూడ, నారాయణపూర్, కొల్తూర్, పోతారం గ్రామాల్లో మంత్రి పాదయాత్ర నిర్వహించనున్నట్లు వివరించారు. అనంతరం మండల కేంద్రమైన మూడుచింతలపల్లిలో లబ్ధిదారులకు కల్యాణ లక్ష్మీ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొంటారని తెలిపారు.

ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్


ఓటరు నమోదు ప్రక్రియను పరిశీలిస్తున్న కౌన్సిలర్ హరిప్రసాదరావు

పోచారం: మున్సిపాలిటీ పరిధిలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో కౌన్సిలర్ బెజ్జంకి హరిప్రసాదరావు ఆధ్వర్యంలో ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్ కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా హరిప్రసాదరావు మాట్లాడుతూ.. రాబోయే అసెంబ్లీ ఎన్నికల ప్రక్రియను దృష్టిలో పెట్టుకొని ఓటరు జాబితాను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. అర్హత ఉన్నవారు ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. కొత్తగా నమోదు చేసుకున్న వారికి త్వరలోనే ఓటరు కార్డులు అందజేస్తామన్నారు.

ఆదర్శ్ బార్ అండ్ రెస్టారెంట్‌కు రూ.10 వేల జరిమానా


ఆదర్శ్ బార్ అండ్ రెస్టారెంట్‌కు జరిమానా విధిస్తున్న మున్సిపల్ సిబ్బంది

ఘట్‌కేసర్: మున్సిపల్ కమిషనర్ ఆదేశానుసారం ఘట్‌కేసర్ బైపాస్ సర్వీస్‌లోని ఆదర్శ్ బార్ అండ్ రెస్టారెంట్‌ను మున్సిపల్ సిబ్బంది బుధవారం తనిఖీ చేశారు. రెస్టారెంట్ అపరిశుభ్రంగా ఉండటం, ఆహార పదార్థాల్లో నాణ్యత లోపించడంతో మున్సిపల్ సిబ్బంది రూ.10 వేలు జరిమానా విధించారు. ఇటువంటి చర్యలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మున్సిపల్ సిబ్బంది మహేందర్, శివ, మల్లేశ్, రాజేశ్, ధర్మేందర్ పాల్గొన్నారు.

బస్టాండ్ ఏర్పాటు చేయాలని వినతి


వినతిపత్రం ఇస్తున్న బీజేవైఎం నాయకులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీలో బస్టాండ్ ఏర్పాటు చేయాలని బీజేవైఎం నాయకులు మున్సిపల్ డీఈ ప్రసాద్‌కు వినతి పత్రం అందజేశారు. మున్సిపాలిటీలో బస్టాండ్ సరిగ్గా లేకపోవడంతో విద్యార్థులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వెంటనే చొరవ చూపి బస్టాండ్ ఏర్పాటు చేయాలని బీజేవైఎం మున్సిపల్ అధ్యక్షుడు బట్టికాడి విక్రమ్ అన్నారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతోందని, నాయకులు గొప్పలు చెప్పడం తప్ప బస్టాండ్ ఏర్పాటు చేయడం లేదని, గ్రామాన్ని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని హామీలు ఇచ్చిన మంత్రి మల్లారెడ్డి మాటలకే పరిమితం అయ్యారని విమర్శించారు. ఇప్పటికైనా మేల్కొని వెంటనే ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు శ్రీధర్, నవీన్‌కుమార్, వెంకట్, అభిలాశ్, భానుప్రకాశ్‌రెడ్డి, నానిగౌడ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.